క్లుప్తంగా

శ్రీహరికోటకు డీఎన్నార్ విద్యార్థినులు



పాలకొల్లు రైల్వే స్టేషన్‌లో డీఎన్నార్ విద్యార్థినులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు విద్యా వైజ్ఞానిక యాత్రకు నెల్లూరు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష పరిశోధన ప్రయోగశాలకు వెళ్లారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలకు చెందిన 80 మంది విద్యార్థినులు, పదిమంది అధ్యాపకులు భౌతిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో రెండు రోజుల యాత్రకు వెళ్లారని పేర్కొన్నారు. ఈ యాత్రకు ప్రోత్సాహించిన తల్లిదండ్రులకు, అనుమతి ఇచ్చిన ఇస్రో యాజమాన్యానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న పాలకొల్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తట్టపర్తి సుధాకర్‌రావు

యలమంచిలి: ఆచంట మండలం వల్లూరు శివారు ఎంపీ పాలెం హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు గురువారం పాలకొల్లు వాకర్స్ క్లబ్ తరపున క్లబ్ అధ్యక్షులు తట్టపర్తి సుధాకర్‌రావు పాఠ్య పుస్తకాలు అందించారు. రూ. 30 వేలు విలువ చేసే కొత్త సబ్జెక్టు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే ఏకైక మార్గం చదువే నన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, సభ్యులు సోమంచి శ్రీనివాసశాస్త్రి, జవ్వాజి కళ్యాణ్, కేశిరాజు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శేషమ్మచెరువు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఎన్నిక



శేషమ్మ చెరువు వైఎస్సార్ సీపీ నూతన కమిటీని అభినందిస్తున్న నాయకులు

పెనుగొండ: ఆచంట మండలం శేషమ్మ చెరువు వైఎస్సార్ సీపీ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు మండల కన్వీనరు జక్కంశెట్టి చంటి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధ్యక్షుడిగా కడలి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా వెన్నపు శ్రీనివాస్, ఊడి జోసెఫ్‌లను, ప్రధాన కార్యదర్శిలుగా నేలపాటి నవీన్, చింతపల్లి తాతయ్య, వైట్ల సుబ్బారావులను, కార్యదర్శులుగా రంపం సురేష్, కోళ్ల సత్యనారాయణ, గుబ్బల ఏడుకొండలు, సభ్యులుగా కుడిపూడి రామకృష్ణ, దొంగనాగేశ్వరరావు, మామిడిశెట్టి సురేష్, లూటుకుర్తిశ్రీనివాస్, వేండ్ర లక్ష్మణరావు, నేలపాటి నాగేంద్ర, తోకల రమేష్, బొక్కా ఆంజనేయులు, నక్క సహదేవుడు, ఇంజేటి సునీల్‌లను ఎన్నుకున్నారు. ఎస్సీసెల్ అధ్యక్షుడిగా గొట్టుముక్కల వెంకటేష్, బీసీ సెల్ అధ్యక్షుడిగా జక్కంశెట్టి పవన్‌కుమార్, యువజన విభాగం అధ్యక్షుడిగా కంబత్తుల అబ్రహం జెసెఫ్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా నేలపాటి దుర్గలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ జక్కంశెట్టి శ్రీరాములు పాల్గొన్నారు.

డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ



చించినాడలో డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఆర్డీఓ దాసి రాజు

యలమంచిలి: రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకత తీసుకువచ్చేందుకు వినియోగదారులకు డిజిటల్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు చెప్పారు. మండలంలోని చించినాడ, పెదలంక గ్రామాల్లో గురువారం ఆయన వినియోగదారులకు నూతన డిజిటల్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త కార్డులో క్యూఆర్ కోడ్ ఉంటుందన్నారు. ఆ కోడ్ స్కానింగ్ చేస్తే కార్డుపై రేషన్ సరుకులు ఏం వచ్చాయి? ఎవరు తీసుకెళ్లారో వివరాలు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్, వీఆర్వోలు సరెళ్ల లక్ష్మీ, గోటేటి లక్ష్మీ నరసింహారావు (బుజ్జి), సీఓ కుర్రెళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఊరూవాడా వినాయక చవితి సందడి

నరసాపురం: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలు పట్టణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో భారీగా వినాయక మండపాలు ఏర్పాటు చేసి చవితి పూజలు ప్రారంభించారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది పలు సెంటర్లలో కొత్తగా మండపాలు ఏర్పాటు చేసి వేడులకు నిర్వహిస్తున్నారు. పండ్ల మార్కెట్‌సెంటర్, పంజాసెంటర్, రాయిపేట మూడుబొమ్మల సెంటర్, చినమామిడిపల్లి, శనివారపుపేట, పేచుపాలెం, వనువులమ్మగుడి, పొన్నపల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేసి భారీ గణపతి విగ్రహాలు ఆకట్టుకున్నాయి. 14వవార్డు అంకానివారిపాలెంలో 2 వేల నెమలి ఈకలతో తయారు చేసిన నెమలి వినాయకుడు భక్తులను ఆకర్షిస్తుంది. అలాగే మండపాల వద్ద విద్యుత్ అలంకరణలు ఆకట్టుకున్నాయి. అయితే బుధవారం ఉదయం నుంచి కురిసిన వర్షం భక్తులను ఇబ్బంది పెట్టింది.

నరసాపురం మండలంలో...

నరసాపురం రూరల్: వినాయకచవితిని బుధవారం ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో వినాయకుడికి ఒక రోజు ఉత్సవాలు చేసి ఘనంగా వినాయకుడిని ఊరేగించి నిమజ్జనం చేశారు. నరసాపురం మండలంలో చిట్టవరం, సారవ, కె.బేతపూడి, మల్లవరం, రుస్తుంబాద, సీతారామపురం సౌత్, నార్త్, పసలదీవి, తూర్పుతాళ్లు, దర్భరేవు, ఎల్‌బీచర్ల, లక్ష్మణేశ్వరం గ్రామాల్లో వినాయకుని విగ్రహాలను ఏర్పాటు చేసి వాటికి ప్రాణప్రతిష్ఠ చేసి షోడసోపచారాలతో పూజించి చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

యలమంచిలిలో..


యలమంచిలి: వినాయకచవితి ఉత్సవాలను బుధవారం భక్తులంతా భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని 32 గ్రామాలలోను ప్రధాన కూడళ్లలో మండపాలు వేసి వినాయక ప్రతిమలను పెట్టి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండపాలను విద్యుత్ దీపాలతోను, పూలతోను సుందరంగా అలంకరించారు. ఉదయం, సాయంత్రం పూజలు చేశారు. తొమ్మిది రోజులపాటు జరగనున్న ఈ ఉత్సవాలతో గ్రామాలలో పండుగ వాతావరణం నెలకొంది.

పెనుగొండలో..

పెనుగొండ: జోరు వర్షంలోనూ ఆచంట, పెనుగొండ మండలాల్లో వినాయక చవితి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి వర్షం సాయంత్రం వరకూ కురుస్తూనే ఉంది. వర్షంలోనే చలువ పందిళ్లలో చవితి పూజలు ఉత్సాహంగా చేశారు. పెనుగొండ, వడలి, సిద్ధాంతం, ఆచంట పెనుమంచిలి, కొడేరు. చినమల్లం, తామరాడ, మునద్రుల్లో భారీ వినాయకులకు పూజలు నిర్వహించారు, సిద్ధాంతంలో చౌదరీస్ సంఘం ఆధ్వర్యంలో చవితి పూజలు నిర్వహించి, నిమజ్జనోత్సవం భారీగా నిర్వహించారు. చింతలపాలెంలోనూ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తానేషపాలెం సంఘం ఆధ్వర్యంలో భారీ గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో శివాజీ విగ్రహం ఆకట్టుకుంది.



పెనుగొండ: వెండికవచ అలంకరణలో సంపత్ వినాయకుడు



నరసాపురం: చినమామిడిపల్లిలో ఏర్పాటు చేసిన విగ్రహం



యలమంచిలి: కాపులపాలెంలో ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహం



యలమంచిలి: హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం



నరసాపురం రూరల్: చిట్టవరంలో పూజలు చేస్తున్న భక్తులు



పెనుగొండ: సిద్ధాంతంలో నిమజ్జనోత్సవం చేస్తున్న దృశ్యం



పెనుగొండ: తానేష్‌పాలెంలో గణపతి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజలపై 'విద్యుత్' భారాన్ని తగ్గించాలి



పెనుగొండ: ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత్ భారాలను తగ్గించాలని సీపీఎం మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యమ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా గురువారం ఆచంట కచేరీ సెంటర్‌లో అమరవీరులు రామకృష్ణ, విష్ణువర్ధన రెడ్డి, బాలస్వామి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పి.మోహనరావు, నేతలు తలుపూరి బుల్లాబ్బాయి, బండి రంగారావు, నెక్కంటి కృష్ణమూర్తి, మన్నే బ్రహ్మయ్య, ఆచంట పెద్దిరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో

ఉమ్మడి రాష్ట్రంలో ప్రపంచ బ్యాంకు ఆదేశిత ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజల కోసం పోరాడి ప్రాణాలర్పించిన అమరవీరులకు సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పెనుగొండ గాంధీ బొమ్మల సెంటర్‌లో నివాళులర్పించారు. త్యాగాలను వృథా కాకుండా ప్రభుత్వ విద్యుత్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడతామంటూ సీపీఎం నాయకులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గుడిమెట్ల వరహాలు రెడ్డి, నాగిశెట్టి గంగారావు, మాదాసు నాగేశ్వరరావు, ఎస్ వెంకటేశ్వరరావు, నీలాపు ఆది నారాయణలు పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం: విద్యుత్ ఉద్యమంలో అమరులైన వీరులకు సీపీఎం, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. గురువారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎస్‌వీ గోపాలన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న అదానీ అనుకూల విద్యుత్ సంస్కరణలు వ్యతిరేకంగా పెంచిన విద్యుత్ ఛార్జీలు, ట్రూ అప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు తదితర ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మండల కార్యదర్శి జల్లి రామ్మోహనరావు, సీపీఐ నేతలు నెక్కంటి క్రాంతి కుమార్, ఆరేటి మృత్యుంజయ, సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు పొగాకు నారాయణరావు, బూడిద జోగేశ్వరరావు, నోముల కొండ, పైల ప్రసాద్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: కూటమి ప్రభుత్వం విద్యుత్ సంస్కరణ పేరుతో ఆదాని గ్రూపుతో ఒప్పందం చేసుకొని స్మార్ట్ మీటర్‌లు బిగిస్తుందని సీపీఎం మండల కన్వీనర్ జవ్వాది శ్రీనివాసరావు విమర్శించారు. 2000 సంవత్సరంలో ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు వేసిందన్నారు. ఆ భారాలకు వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలు ఉద్యమం చేపడితే ముగ్గురిని కాల్చి చంపిందన్నారు. ఆనాటి అమరవీరులు బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్‌లకు సంతాప సూచకంగా గురువారం స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో యర్రా కృష్ణారావు, టి.గంగరాజు, కె.రాయపరాజు, ఎస్.పురుషోత్తం, యాకల రాము, వై.అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పెనుగొండ: ఆచంటలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



నరసాపురం: అంబేద్కర్ సెంటర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు



పాలకొల్లు సెంట్రల్: అమరవీరులకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నేడు నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నరసాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం ఉదయం 11.30 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని స్పష్టం చేశారు. సమావేశానికి సభ్యులు విధిగా హాజరుకావాలని కోరారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



తూర్పుతాళ్లు పీహెచ్‌సీని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

నరసాపురం రూరల్: ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం నరసాపురం మండలం తూర్పుతాళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నాగరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తొలుత పీహెచ్‌సీలోని మందులు, ల్యాబ్, స్టాఫ్ రూమును తనిఖీ చేశారు. ఓపీ రికార్డులతో పాటు సిబ్బంది హాజరు పట్టీని పరిశీలించారు. హాస్పటల్‌ను పరిశుభ్రమైన వాతావరణం లో ఉంచాలని సూచించారు. అనంతరం హాస్పటల్‌కు వచ్చిన రోగులతో కలెక్టర్ మాట్లాడారు. కలెక్టర్ వెంట సీహెచ్‌ఓ కె.శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్ అనిల్ కుమార్, తహసీల్దార్ ఐవీవీ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

వినాయక మండపాలకు లడ్డూల అందజేత



లడ్డూను అందజేస్తున్న ధర్మపరిరక్షణ సమితి సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ధర్మపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పాలకొల్లులో గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న మండపాలకు వెళ్లి లడ్డూ ప్రసాదాలను అందచేశారు. సుమారు 40 మండపాలకు వెళ్లి ఒక్కో మండపానికి 2 కేజీల లడ్డూలను అందజేశారు. ముందుగా క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో గణపతికి లడ్డూను అందజేశారు. అనంతరం పట్టణంలో నిర్వహిస్తున్న గణపతి మండపాలకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షులు గాదె వెంకన్న, సీరం ఆనందకృష్ణ, మేడికొండ శ్రీనివాస్, బాకూరి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల ఆకస్మిక తనిఖీ



సిద్ధాంతంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

పెనుగొండ: సిద్ధాంతంలో ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు, వ్యవసాయ శాఖ సంయుక్తంగా గురువారం ఆకస్మిక తనికీలు నిర్వహించారు. ఎరువుల నిల్వల్లో ఆన్‌లైన్, భౌతిక నిల్వల్లో వ్యత్యాసం ఉండడంతో రూ.1.42 లక్షల విలువైన ఎరువులను సీజ్ చేసినట్లు మండల వ్యవసాయాధికారి పి.స్పందన తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు పి.శివరామకృష్ణ, పి.శ్రీధర్ పాల్గొన్నారు.

పాలకొల్లులో రెడ్‌బుక్ రాజ్యాంగం



ఏలూరు కోర్టు వద్ద పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు

యలమంచిలి: పాలకొల్లులో రెడ్ బుక్ రాజ్యాంగం కేసు నమోదు కావడంతో నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ ప్రధాన నాయకులంతా గురువారం ఏలూరు కోర్టుకు హాజరయ్యారు. 2022లో పాలకొల్లులో టిడ్కో ఇళ్ల ప్రారంభ సమయంలో శిలాఫలకంపై తన పేరు చిన్నది వేశారంటూ అప్పటి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు రాద్ధాంతం చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 24 మంది వైఎస్సార్ సీపీ నాయకుల మీద 2022లో తనను దూషించారంటూ పార్టీ నాయకుల చేత కేసు పెట్టించి ఎస్టీ, ఎస్సీ కేసు నమోదు చేయించారు. ఈ 24 మందిలో 9 మంది ఎస్సీలు, ఒక ఎస్టీ ఉండడం గమనార్హం. ఈ విధంగా ఎస్సీ, ఎస్టీల మీద ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయించిన ఘనత మంత్రి నిమ్మల రామానాయుడుకి దక్కింది. ఈ కేసు వాయిదాకు వైఎస్సార్ సీపీ ప్రధాన నాయకులంతా కోర్టుకు హాజరయ్యారు.

సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న పాలకొల్లు సహాయ వ్యవసాయ సంచాలకుడు పలివెల మురళీకృష్ణ

యలమంచిలి: మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు ఎరువులు, పురుగు మందులను సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి డ్రోన్ సహాయంతో పిచికారీ చేసుకోవాలని పాలకొల్లు ప్రాంతీయ సహాయ వ్యవసాయ సంచాలకులు పలివెల మురళీకృష్ణ కోరారు. కవిటం, పోడూరు గ్రామాల్లో గురువారం వ్యవసాయ శాఖ, ఆత్మ సంయుక్తంగా వరి ఉత్పత్తిలో సాంకేతిక పరిజ్ఞానం అనే అంశంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రోన్ సహాయంతో పిచికారి చేయడం వలన సాగు ఖర్చు తగ్గుతుందన్నారు. అదే విధంగా సిఫారసు చేసిన ఎరువులను మోతాదు వరకు మాత్రమే చల్లాలన్నారు. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడి సాధించాలని ఆయన కోరారు . ఉండి కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ మల్లికార్జున్ మాట్లాడుతూ పురుగు మందులు విచక్షణా రహితంగా వినియోగించరాదన్నారు. ప్రస్తుతం పైరుకు పెద్దగా పురుగులు ఏమి ఆశించలేదని రైతులు తొందరపడి పురుగు మందులు పిచికారీ చేసి ఖర్చు పెంచుకోవద్దని చెప్పారు. మండల వ్యవసాయాధికారి ఎం.విశ్వాసరావు మాట్లాడుతూ రైతులు అందరూ పంట నమోదు చేయించుకోవాలని, పీఎం ఎఫ్‌బీవై ఇన్సూరెన్ ప్రీమియం రూ. 210 కట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెట్టబత్తుల సువర్ణరాజు, సొసైటి ప్రెసిడెంట్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



మట్లాడుతున్న ఐజీ జీవీజీ అశోక్ కుమార్

నరసాపురం రూరల్: రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా వ్యవహరిస్తేనే ఈ నేరాలను అదుపు చేయగలమని ఐజీ, జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా నరసాపురం రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి మిమ్మల్ని భయపెట్టినా, ఆర్థిక లావాదేవీల వివరాలు ఇవ్వాలని బెదిరించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. జాతీయ రహదారులపై ప్రయాణించేటప్పుడు నిబంధనలు పాటించాలన్నారు. నేరాలు అదుపులో ఉండేందుకు వ్యాపారులు, వివిధ సంస్థలు, గృహయజమానులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని సూచించారు. ఇప్పటి నుంచి పండుగల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు పోలీసులకు సమాచారం అందించి రక్షణను కోరవచ్చునన్నారు. ఏలూరు రేంజ్ పరిధిలో డ్రగ్స్ పూర్తిగా నివారించామన్నారు. మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌లో తరచూ ప్రమాదాలు జరిగి మృత్యువాత పడుతున్నారన్నారు. ఈ సమస్య పరిష్కారానికి బీచ్‌కు కాపలాగా శాశ్వత పెట్రోలింగ్‌ను ఏర్పాటు చేసే ఆలోచన ఉందన్నారు. తొలుత ఐజీ అశోక్ కుమార్, ఎస్పీ నయీం అస్మీలు పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో డీఎస్పీ డాక్టర్ జి.శ్రీ వేద, రూరల్ సీఐ దుర్గాప్రసాద్, టౌన్ సీఐ యాదగిరి, మొగల్తూర్ ఎస్సై జి వాసు, రూరల్ ఎస్సై వెంకట సురేష్, మహిళా ఎస్సైలు జయలక్ష్మి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సర్వేలు వేగవంతం చేయాలి



ఆచంటలో ప్రభుత్వ సర్వేలపై సమీక్ష చేస్తున్న ఎంపీడీఓ

పెనుగొండ: ప్రభుత్వ నిర్దేశిత సర్వేలను వేగంగా నిర్వహించాలని ఆచంట ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ సూచనలు వివరించారు. స్వమిత్వ, ఫించన్ల పంపిణీ, భారీ వర్షాలుకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీఓ బులి సూరన్న, కార్యదర్శులు హనుమంతరావు, నాగబాబు, ఫణి, తేజ, గణేష్ కుమార్, జానకి , భాగ్యశ్రీ, రామారావు తదిరులు పాల్గొన్నారు.

స్వమిత్వ సర్వేకు సహకరించాలి

యలమంచిలి: మండలంలోని 9 రెవెన్యూ గ్రామాలలో (13 గ్రామ పంచాయితీలు) జరుగుతున్న స్వమిత్వ సర్వేకు ప్రజలంతా సహకరించాలని డిప్యుటి ఎంపీడీఓ జేడీవీ ప్రసాద్ కోరారు. గ్రామ కంఠములోని ఆస్తులకు (ఇళ్లు, ఖాళీ స్థలములు) ఆస్తి యాజమాన్యపు హక్కు ధృవీకరణ పత్రములు జారీ చేసేందుకు స్వమిత్వ సర్వే చేస్తున్నట్లు ఆయన వివరించారు. సర్వే బృందం వచ్చినపుడు ఇంటి యజమానులు వారు అడిగిన వివరాలు తెలిపి ఆస్తికి సంబంధించిన డాక్యుమెంట్స్ జిరాక్స్ కాపీ ఇవ్వాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు ఆయా గ్రామ కార్యదర్శులను సంప్రదించాలని ఆయన కోరారు.

పాల వ్యాన్ బోల్తా

పెనుగొండ: మండలంలోని వడలి-పిట్టలవేమవరం రహదారిలో గురువారం పాలవ్యాన్ బోల్తా పడింది. వడలి దాటిన తరువాత సింగిల్ రోడ్డు మార్జిను సరిగా లేకపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పంటబోదేలో బోల్తా పడింది. దీంతో తృటిలో ప్రమాదం తప్పింది. మార్జిన్ సరిగా లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.